లక్ష్మీనరసింహుడికి వైభవంగా నిత్య తిరుకల్యాణోత్సవం

నిత్య తిరుకల్యాణోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, జూలై 20: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో శనివారం స్వామి, అమ్మవార్ల నిత్య తిరుకల్యాణోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. మొదటి ప్రాకార మండపంలో సుదర్శన నారసింహహోమం జరిపిన అర్చకులు ఉత్సవమూర్తులను దివ్య మనోహరంగా అలంకరించి కల్యాణోత్సవ సేవను జరిపారు. కల్యాణ మండపంలో స్వామి, అమ్మవార్లను వెంచేపు చేసి కల్యాణతంతును చేపట్టారు. తెల్లవారు జామునే ఆలయాన్ని తెరిచిన అర్చకులు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, తిరువారాధన జరిపి, ఉదయం ఆరగింపు చేపట్టారు. ప్రధానాలయంలో స్వామి, అమ్మవార్లకు నిజాభిషేకం జరిపారు. స్వామివారికి తులసీ సహస్రనామార్చన, అమ్మవారికి కుంకుమార్చన, ఆంజనేయ స్వామికి సహస్రనామార్చన చేపట్టి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు దర్శనాలు కొనసాగాయి. సుమారు 6వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అధికారులు వెల్లడించారు. అన్ని విభాగాలను కలుపుకొని స్వామివారి ఖజానాకు రూ. 15,43,717 ఆదాయం సమకూరిందని అనువంశికధర్మకర్త బి. నరసింహమూర్తి, ఈఓ భాస్కర్‌రావు తెలిపారు.

బహిరంగ మార్కెట్ ధర ఇవ్వాల్సిందే

● నేషనల్ హైవే 930 భూ నిర్వాసితుల డిమాండ్

రైతులతో సమావేశమైన అధికారులు

భూదాన్‌పోచంపల్లి, జూలై 20 : తమ భూములకు ప్రస్తుతం బహిరంగ మార్కెట్లో ఎకరానికి రూ.2కోట్ల ధర పలుకుతున్నదని, ప్రభుత్వం ఎకరానికి రూ.25 నుంచి 28లక్షలు మాత్రమే ఇస్తే తాము భూములు ఇవ్వలేమని భూ నిర్వాసితులు అధికారులకు తేల్చిచెప్పారు. గౌరెల్లి నుంచి భద్రాచలం వరకు నిర్మించనున్న జాతీయ రహదారి 930 పితో భూములు కోల్పోతున్న పిలాయిపల్లి, జగత్‌పల్లి గ్రామాల రైతులతో చౌటుప్పల్ ఆర్డీఓ శేఖర్‌రెడ్డి శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమావేశమయ్యారు. రైతుల నుంచి అభ్యంతరాలు, అభిప్రాయాలను సేకరించారు. రంగారెడ్డి జిల్లాలో ప్రభుత్వం ఎకరానికి రూ.42 లక్షలు ఇస్తుండగా తమ భూములకు తక్కువ ఎలా ఇస్తారని రైతులు అధికారులను ప్రశ్నించారు. అన్ని జిల్లాల్లో సమానంగా పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ భూ నిర్వాసితులకు ఎకరానికి రూ. 28 లక్షల వరకు పరిహారం అందిస్తామన్నారు. పిలాయిపల్లిలో 57 మంది రైతుల వద్ద 30.02 ఎకరాలు, జగత్‌పల్లిలో 25 మంది రైతుల నుంచి 10.6 ఎకరాల భూమిని సేకరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో తాసీల్దార్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేందర్ శర్మ, ఎంఆర్ఐ గుత్త వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

పభుత్వ భూమి ఇవ్వాలి

భూదాన్‌పోచంపల్లి : గౌరెల్లి–భద్రాచలం జాతీయ రహదారి నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ప్రభుత్వ భూములు ఇవ్వాలని డీసీసీ ఉపాధ్యక్షుడు కళ్లెం రాఘవరెడ్డి, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు పాక మల్లేశ్‌యాదవ్ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ బహిరంగ మార్కెట్లో రూ. కోటి 50 లక్షల ధర ఉండగా ప్రభుత్వ విలువ ఆధారంగా పరిహారం ఇస్తామనడం సరికాదన్నారు.

ఆందోల్ మైసమ్మకు పట్టువస్త్రాలు సమర్పిస్తున్న దేవాదాయశాఖ అధికారులు

ఆందోల్ మైసమ్మ ఉత్సవాలు షురూ

చౌటుప్పల్ రూరల్, జూలై 20 : మండలంలోని దండు మల్కాపురం గ్రామంలోని ఆందోల్ మైసమ్మ దేవాలయ ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మొదటిరోజు అఖండ దీపారాధన, గణపతి పూజ, పుణ్యవాచనం, అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాలను నల్లగొండ జిల్లా దేవాదాయశాఖ సహాయ కమిషనర్ కె. మహేంద్రకుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎస్. మోహన్‌బాబు, మాజీ జడ్పీటీసీ చిలుకూరి ప్రభాకర్‌రెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు చిలుకూరి మల్లారెడ్డి, బుర్ర స్వామిగౌడ్, ముదికొండ రమేశ్, గుండు శ్రీహరిగౌడ్, చిట్టంపల్లి జంగయ్య, విజయ్, గంగాధర్ పాల్గొన్నారు.

ఫొటోగ్రాఫర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ఆర్థికసాయం అందిస్తున్న సిరిపురం గ్రామస్తులు

రామన్నపేట, జూలై20: మండలంలోని సిరిపురం గ్రామానికి చెందిన ఫొటోగ్రాఫర్ మిర్యాల రామకృష్ణ (38) ఈ నెల 17న మృతి చెందాడు. దాంతో అతడిపై ఆధారపడ్డ తల్లి, భార్య, ఇద్దరు పిల్లల దిక్కులేని వారయ్యారు. అతడి కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామపెద్ద రామకృష్ణ సోషల్ మీడియా వేదికగా పిలుపునిచ్చారు. దాంతో స్పందించిన గ్రామస్తులు, బంధువులు, స్నేహితులు రూ.3.5 లక్షలను జమచేసి శనివారం ఫొటోగ్రాఫర్ కుటుంబానికి అందించారు. ఈ కార్యక్రమంలో మూడు రోజుల్లోనే 400 మంది భాగస్వాములయ్యారు. ఇంకా ఎవరైనా ఆర్థిక సాయం అందించదలచుకుంటే 9849643984 నంబర్‌కు ఫోన్‌పే చేయాలని గ్రామ పెద్దలు కోరారు. కార్యక్రమంలో ఈడెం శ్రీనివాస్, జెల్ల శ్రీనివాస్, గోశిక చక్రపాణి, పున్న వెంకటేశం, బండ శ్రీనివాస్‌రెడ్డి, ఏళ్ల మధుసూదన్‌రెడ్డి, గజం నరేశ్, అప్పం గోపాల్, పున్న భద్రాచలం, పున్న వేణు, రాపోలు రాజశేఖర్, గంజి వీరయ్య పాల్గొన్నారు.

ఘనంగా భిక్షమయ్యగౌడ్ జన్మదిన వేడుకలు

ఆలేరులో భిక్షమయ్యగౌడ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

భువనగిరి కలెక్టరేట్, జూలై 20 : ఆలేరు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ పుట్టినరోజు వేడుకలను శనివారం ఆలేరులోని ప్రకాశ్ గార్డెన్‌లో బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు డాక్టర్ ర్యాకల శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో భిక్షమయ్యగౌడ్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు.జ్ఞాపికను అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ భువనగిరి మండలాధ్యక్షుడు జనగాం పాండు, వలిగొండ మాజీ జడ్పీటీసీ మొగుళ్ల శ్రీనివాస్, నాయకులు పల్సం రమేశ్, మాద శంకర్‌గౌడ్, బొడ్డుపల్లి కృష్ణ, అభిమానులు పాల్గొన్నారు.

ఆలేరు పట్టణంలో..

యాదగిరిగుట్ట : మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్యగౌడ్ జన్మదిన వేడుకలను శనివారం ఆలేరు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలేరులోని సాయిబాబా ఆలయంలో బీఆర్ఎస్ కార్యకర్తలతో కలిసి భిక్షమయ్యగౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ర్యాలీగా ప్రభుత్వాసుపత్రికి వెళ్లి రోగులకు పండ్లు పంపిణీ చేశారు. పట్టణంలోని ప్రకాశ్ గార్డెన్‌లో రాఘవ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం భారీ కేక్‌ను కట్ చేశారు. నియోజకవర్గానికి చెందిన మాజీ ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు భిక్షమయ్యగౌడ్‌కు పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఆలేరు మున్సిపల్ చైర్మన్ వస్పరి శంకర్, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు పుట్ట మల్లేశ్, పార్టీ మండలాధ్యక్షుడు కర్రె వెంకటయ్య, గంగుల శ్రీనివాస్, బొట్ల యాదయ్య, శ్రీనివాస్‌గౌడ్, ఎండీ ఖలీల్, మాజీ జడ్పీటీసీలు తోటకూరి అనూరాధ, పల్లా వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు బబ్బూరి రవీంద్రనాథ్, మొగిలిపాక రమేశ్, గోపగాని బాలమణి, నాయకులు గడ్డమీది రవీందర్‌గౌడ్, ఎగ్గిడి కృష్ణ, మిట్ట వెంకటయ్య, శిఖ శ్రీనివాస్, చిత్తర్ల బాలయ్యగౌడ్, దూదిపాల రవీందర్‌రెడ్డి, పల్లె సంతోశ్‌గౌడ్, అధిక సంఖ్యలో పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

భువనగిరిలో శుభాకాంక్షలు తెలుపుతున్న బీఆర్ఎస్ నాయకులు

పేదలకు అండగా ఎస్ఏఎఫ్ తవక్కల్ ఫౌండేషన్

● సమాజ సేవలో ముందున్న ఫౌండేషన్ చైర్మన్ సయ్యద్ అస్లామొద్దీన్

ఆంజనేయ మాలధారులకు భిక్ష పెడుతున్న అస్లామొద్దీన్(ఫైల్)

ఆలేరురూరల్, జూలై 20 : ప్రార్థించే పెదవుల కన్నా సాయం చేసే చేతులు మిన్న అనేది నానుడి. దానిని నిజం చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు ఎస్ఏఎఫ్ తవక్కల్ ఫౌండేషన్ వ్యవస్థాపక చైర్మన్ సయ్యద్ అస్లామొద్దీన్. ఆపదలో ఉన్నవారిని ఆదుకుంటూ సమాజ సేవే పరమావధిగా ముందుకు సాగుతూ ఆదర్శంగా నిలుస్తున్నారు. ఆలేరు మండలంలోని కొలనుపాక గ్రామానికి చెందిన సయ్యద్ అస్లామొద్దీన్ 2023లో ఎస్ఏఎఫ్ తవక్కల్ ఫౌండేషన్‌ను స్థాపించారు. ఫౌండేషన్ ద్వారా తన స్వగ్రామానికి సేవ చేయాలనే సంకల్పంతో కుల మతాలకు అతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తాను సంపాదించిన దానిలో కొంత పేద ప్రజల కోసం వెచ్చిస్తున్నారు. అస్లామొద్దీన్ ప్రస్తుతం ఎల్ఎల్‌బీ చదువుతూనే సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. గ్రామంలో పేదింటి ఆడబిడ్డల పెండ్లికి, ఎవరైన మృతి చెందితే దహన సంస్కారాల కోసం ఆర్థిక సాయం అందిస్తున్నారు. గ్రామంలోని పురాతన ఆలయాలు, మసీదులకు మరమ్మతులు చేపడుతున్నారు. ఇటీవల కొలనుపాక ప్రాథమిక పాఠశాల ప్రహరీతో పాటు గేటు పునరుద్ధరణకు తన వంతు సాయం అందించి స్థానికులతో భేష్ అనిపించుకున్నారు.

కొలనుపాకలో తవక్కల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న మాజీ సర్పంచ్ లక్ష్మీప్రసాద్‌రెడ్డి

బాధితులకు ఎల్ఓసీ అందజేత

ఎల్ఓసీ అందిస్తున్న ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

భువనగిరి అర్బన్/భూదాన్‌పోచంపలి, జూలై 20: అనారోగ్యం బారిన పడి చికిత్స పొందుతున్న వారికి సీఎం సహాయనిధి నుంచి మంజూరైన ఎల్ఓసీ పత్రాలను శనివారం పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి అందించారు. భువనగిరి మండంలోని హన్మాపురం గ్రామానికి చెందిన చిచ్చాల సుగుణమ్మకు రూ.30 వేలు, భూదాన్‌పోచంపల్లి మండలం పెద్దరావులపల్లి గ్రామానికి చెందిన పల్ల లక్ష్మికి రూ. 2.50 లక్షల ఎల్ఓసీని ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చిలక బుచ్చయ్య, కాంగ్రెస్ నాయకులు తుమ్మేటి వెంకటేశ్, రవికుమార్, బొబ్బిలి నర్సిరెడ్డి, హన్మగంటి బాల్‌రాజ్, మోతె బాలు, వర్కాల బాలచందర్, చేగూరి ప్రభాకర్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే శేఖర్‌రెడ్డి

బీబీనగర్, జూలై 20 : బీఆర్ఎస్ పార్టీ జైనపల్లి గ్రామ మాజీ అధ్యక్షుడు నక్కిర్తి గణేశ్ మాతృమూర్తి లక్ష్మమ్మ శనివారం మృతి చెందారు. విషయం తెలుసుకున్న భువనగిరి మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి లక్ష్మమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట రైతుబంధు సమితి మాజీ కోఆర్డినేటర్ బొక్క జైపాల్‌రెడ్డి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి చింతల సుదర్శన్‌రెడ్డి, నాయకులు తంతరపల్లి అంజయ్యగౌడ్, సోం శ్రీనివాస్, రమేశ్, జక్కి నగేశ్, బాలపోచయ్య, హరిబాబు, భాస్కర్, గణేశ్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తో మదర్‌డెయిరీ చైర్మన్ శ్రీకర్‌రెడ్డి

బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను కలిసిన మదర్‌డెయిరీ చైర్మన్

యాదగిరిగుట్ట, జూలై20: బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను శనివారం మదర్ డెయిరీ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డితో కలిసి ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో కేసీఆర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఆయన వెంట మదర్ డెయిరీ డైరక్టర్ చింతలపూడి వెంకటరామిరెడ్డి ఉన్నారు.

జిల్లా కేంద్ర దవాఖానలో బదిలీలు

భువనగిరి అర్బన్, జూలై 20: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ దవాఖానలో పలువురు వైద్యాధికారులను వైద్యశాఖ అధికారులు బదిలీ చేశారు. ఏరియా దవాఖాన సూపరింటెండెంట్ చిన్నానాయక్ జిల్లా కమ్యూనిటీ హెల్త్ సర్వీస్ అధికారిగా బదిలీ కాగా ఆయన స్థానంలో సికింద్రాబాద్ గాంధీ దవాఖాన సూపరింటెండెంట్ రాజారం బదిలీపై రానున్నారు. యాదాద్రి మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ మల్లికార్జున్ బదిలీ కాగా ఆయన స్థానంలో రాష్ట్ర వైద్యశాఖలో డీఎంఈగా పని చేస్తున్న రమేశ్‌రెడ్డి రానున్నారు.

మార్కండేశ్వర ఆలయ కమిటీ ఎన్నిక వాయిదా వేయాలని వినతి

భూదాన్‌పోచంపల్లి, జూలై 20 : స్థానిక మార్కండేశ్వర దేవాలయ కొత్త కమిటీ ఎన్నికను వాయిదా వేయాలని ఆలయ కమిటీ సభ్యుడు కర్నాటి పాండు, చిక్క కృష్ణ డిమాండ్ చేశారు. శనివారం ఆలయ కమిటీ ప్రతినిధులు మంగళపల్లి రాజా రమేశ్, భోగ సిద్ధిరాములు, సీతాకృష్ణకు ఈ మేరకు వినతిపత్రం అందించారు. ప్రస్తుతం ఉన్న కమిటీని మరో ఏడాది పొడిగించేందుకు సర్వసభ్య సమావేశంలో తీర్మానించారని తెలిపారు. సర్వసభ్య సమావేశంలో ఆమోదించిన తీర్మానాలను పక్కనపెట్టి ఆలయ కమిటీ ఎన్నిక బాధ్యత పద్మశాలీ మహాజన సంఘానికి అప్పగించడం సరికాదన్నారు. కార్యక్రమంలో నాయకులు భోగ స్వామి, బల్ల దుర్వాసులు, గాడి పల్లి పరమేశ్వర్, నాగేశ్వర్, కూరపాటి బాబు, చెన్నకేశవులు, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

● డీసీపీ రాజేశ్‌చంద్ర

సమావేశంలో మాట్లాడుతున్న డీసీపీ రాజేశ్‌చంద్ర

భువనగిరి కలెక్టరేట్, జూలై20: పోలీస్‌స్టేషన్లలో పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని డీసీపీ రాజేశ్‌చంద్ర ఆదేశించారు. శనివారం మండలంలోని హన్మాపురంలోని రాచకొండ కమిషనరేట్ జోనల్ కార్యాలయంలో నిర్వహించిన క్రైం రివ్యూ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో దొంగతనాల నివారణకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. విధులపట్ల అలసత్వం వహించవద్దని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీలు, సీఐలు, ఎస్‌లు పాల్గొన్నారు.

కాల్వ పనులు త్వరగా పూర్తి చేయాలి : ఎమ్మెల్యే సామేల్

కాల్వ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మందుల సామేల్

మోత్కూరు, జూలై 20 : మోత్కూరు పట్టణంలోని ఎస్‌బీఐ వద్ద నిర్మిస్తున్న వరద కాల్వ పనులను త్వరగా పూర్తి చేయాలని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ ఆదేశించారు. శనివారం నిర్మాణ పనులను పరిశీలించారు. వర్షాలు ఊపందుకుంటున్న నేపథ్యంలో కాల్వ నిర్మాణం పూర్తయితే వరద నీరు చెరువులోకి వెళ్తుందన్నారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ శ్రీకాంత్, నాయకులు లక్ష్మీనర్సింహారెడ్డి, బయ్యని రాజు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ట్రై సైకిళ్ల పంపిణీ

దివ్యాంగులకు ట్రై సైకిళ్లను అందిస్తున్న దాతలు

బీబీనగర్, జూలై 20 : మోటివేషన్ ఇండియా, సుధాకర్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వివిధ గ్రామాలకు చెందిన దివ్యాంగులకు శనివారం 25 ట్రై సైకిళ్లను అందించారు. మండలంలోని నెమరగోమ్ముల గ్రామంలోని వీఎల్ఎన్ ఫంక్షన్ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బ్రహ్మకుమారీస్ రిట్రీట్ సెంటర్ ప్రతినిధి సునీత పాల్గొని మాట్లాడారు. ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో సుధాకర్ ఫౌండేషన్ చైర్మన్ యర్కల సుధాకర్‌గౌడ్, మోటివేషన్ ఇండియా ప్రతినిధులు సుధాకర్, ప్రశాంత్, విష్ణు, నందిని, శేఖర్, నాయకులు కొణతం లింగయ్యగౌడ్, సురకంటి సుధాకర్‌రెడ్డి, ఎర్కల బాలకృష్ణగౌడ్, కుమార్, పంజాల సతీశ్‌గౌడ్ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో పనులు త్వరగా పూర్తిచేయాలి

● జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీహరి

తిమ్మాపూర్‌లో పనులను పరిశీలిస్తున్న అధికారులు

బొమ్మలరామారం, జూలై 20 : అమ్మ ఆదర్శ కమిటీల ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని జిల్లా సెక్టోరియల్ అధికారి శ్రీహరి అయ్యంగార్ ఆదేశించారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్‌లో జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం తనిఖీ చేశారు. పనులను నాణ్యతతో చేపట్టాలని సూచించారు. ఆయన వెంట ప్రధానోపాధ్యాయులు జి.శ్రీనివాస్, పట్టాభిసీతారాంరెడ్డి, పి .కృష్ణారెడ్డి ఉన్నారు.

శ్రమ శక్తి పురస్కారం అందజేత

శాంతయ్యకు పురస్కారం అందిస్తున్న అభినయ శ్రీనివాస్

మోత్కూరు, జూలై20 : కష్టించి పని చేస్తేనే గుర్తింపు లభిస్తుందని సినీ గేయ రచయిత అభినయ శ్రీనివాస్ అన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో తన తండ్రి దొంతోజు బ్రహ్మచారి జ్ఞాపకార్థం శ్రమశక్తి పురస్కారాలను అందించారు. సూర్యాపేటకు చెందిన లక్ష్మీ గణేశ్ ఇంజినీరింగ్ వర్స్ మేనేజింగ్ డైరెక్టర్ శ్రీమాద శాంతయ్యకు పురస్కారం అందించి సత్కరించారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ లక్ష్మీనర్సింహారెడ్డి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపాల్‌రెడ్డి, సతీశ్‌చారి, బ్రహ్మచారి, మల్లయ్యచారి పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య : ఎంఈఓ

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి

భువనగిరి కలెక్టరేట్, జూలై 20 : ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందని ఎంఈఓ నాగవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని ఎర్రంబెల్లి మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడు సంవత్సరాల నుంచి మూతబడి ఉన్న పాఠశాలను తెరిపించి, 20 మంది విద్యార్థులతో నడిపిస్తున్న హెచ్ఎం వనం శ్రీనివాసులు, పాఠశాల అభివృద్ధికి సహకారాన్ని అందిస్తున్న రిటైర్డ్ ప్రొఫెసర్ ఎస్. మధుసూదన్‌రెడ్డి సేవలను ప్రశంసించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ శైలజ, విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేయాలి

● బీఆర్ఎస్ జిల్లా నాయకుడు ఇంద్రారెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఇంద్రారెడ్డి

ఆత్మకూరు(ఎం), జూలై 20 : సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన హామీ ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణాలను మాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు యాస ఇంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల ముందు ఏకకాలంలో పంట రుణాలు మాఫీ చేస్తామని చెప్పి, నేడు అధికారంలోకి వచ్చి ఏడు నెలల తర్వాత కూడా దశల వారీగా మాఫీ చేస్తామని చెప్పడం రైతులను మోసం చేయడమే అన్నారు. రుణమాఫీ పేరుతో రైతుభరోసాకు ఎగనామం పెట్టేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతుందన్నారు. రైతులకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నప్పటికీ 10 ఎకరాల వరకు రైతుభరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. నాడు రైతువేదికలు ఎందుకూ పనికి రావని విమర్శించిన కాంగ్రెస్ నాయకులు నేడు అవే రైతు వేదికల్లో రుణమాఫీ సంబురాలు జరుపుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు బీసు చందర్‌గౌడ్, మండల సెక్రటరీ జనరల్ పంజాల వెంకటేశ్‌గౌడ్, నాయకులు కోరె భిక్షపతి, ఉప్పలయ్య, దశరథగౌడ్, సత్తయ్య, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు నాగరాజు, మల్లిఖార్జున్, సతీశ్, విశాల్, వెంకట్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి పాల్గొన్నారు.

బావిలో పడి రైతు మృతి

రాజాపేట, జూలై 20 : ప్రమాద వశాత్తు బావిలో పడి తీవ్రంగా గాయపడిన మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన రైతు నిమ్మల అనంతరెడ్డి(50) చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఎస్ఐ ఉపేందర్ యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. అనంతరెడ్డి వ్యవసాయ పనుల కోసం శుక్రవారం ఉదయం పొలానికి వెళ్లి సాయంత్రం తిరిగి ఇంటికి రాలేదు. అతడి భార్య అంజమ్మ పక్కింటి వాళ్లతో కలిసి వ్యవసాయ బావి వద్ద వెతకగా మోటారు పైపును సరిచేసే క్రమంలో బావిలో పడి తీవ్ర గాయాలతో కొన ఊపిరితో కనిపించాడు. బావిలో పూడిక తీసేందుకు బిగించి క్రేన్ సాయంతో అతడిని బయటికి తీసి చికిత్స కోసం హైదరాబాద్‌లోని దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

సమయ పాలన పాటించని రెవెన్యూ సిబ్బంది

అధికారులు రాకపోవడంతో ఖాళీగా ఉన్న కుర్చీలు

సంస్థాన్ నారాయణపురం, జూలై20: మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయ ఉద్యోగులు సమయపాలన పటించక పోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. శనివారం ఉదయం 11 గంటలు దాటినా కంప్యూటర్ అపరేటర్ మినహా ఒక్కరూ కూడా విధులకు హాజరు కాలేదు. దాంతో కార్యాలయంలో కుర్చీలన్నీ ఖాళీగా దర్శనమిచ్చాయి. పనుల నిమిత్తం వివిధ గ్రామాల నుంచి తాసీల్దార్ కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఇబ్బందులు పడ్డారు. సమయపాలన పాటించని ఉద్యోగులపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి

ఎల్లమ్మ(ఫైల్)

రాజాపేట, జూలై 20 : మండల కేంద్రానికి చెందిన తాళ్లపల్లి ఎల్లమ్మ(101) శనివారం ఉదయం మృతి చెందింది. వందేండ్లు నిండినా తనపని తాను చేసుకునేదని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమెకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలి : డీఆర్‌డీఓ

ఆలేరురూరల్, జూలై 20 : మొక్కలు నాటడంతో వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, వనమహోత్సవం కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని డీఆర్డీఓ కృష్ణన్ ఆదేశించారు. శనివారం మండలంలోని పటేల్‌గూడెం గ్రామంలో నర్సరీని పరిశీలించిన అనంతరం మొక్కలు నాటారు. గ్రామంలో నాటిన ప్రతి మొక్కను కాపాడాలని ఉపాధిహామీ సిబ్బందికి సూచించారుసూచించారు. అనంతరం ఎంపీడీఓ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ సత్యాంజనేయప్రసాద్, ఎంపీఓ సలీమ్, పంచాయతీ కార్యదర్శి మీన ఉన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న హెచ్ఎంలు

బదిలీ అయిన ఉపాధ్యాయులకు సన్మానం

బొమ్మలరామారం, జూలై 20 : మండలంలోని మర్యాల గ్రామ జడ్పీహెచ్ఎస్‌లో పని చేస్తూ